




అపోలో ఆస్పత్రిలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రపంచ పార్కిన్సన్స్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నాడీ సంబంధిత రుగ్మతలలో ఒకటైన పార్కిన్సన్స్ వ్యాధి నివారణకు అవసరమైన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అపోలో ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందు మీనన్ ,న్యూరాలజిస్టులు డాక్టర్ రష్మీ, డాక్టర్ ముత్తరాజు శివ శంకర్ లు పాల్గొని ప్రజలలో అవగాహన పెంచడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను హైలైట్ చేయడం, సంరక్షణకు ప్రాప్యతను మెరుగుపరచడం, రోగులు,సంరక్షకులు ఎదుర్కొంటున్న శారీరక, భావోద్వేగ, సామాజిక సవాళ్లను పరిష్కరించడంపై దష్టి పెడుతుందని సూచించారు. సమావేశంలో అపోలో ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బిందుమీనన్


విద్యాలయాల్లో విష సంస్కృతి..!

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనీ విద్యాలయాల్లో విషసంస్కృతి రాజ్యమేలు తోంది... ప్రధానంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో మద్యం, డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతుందనే తెలుస్తోంది...రౌడీ గ్యాంగ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి... దొంగతనాలు, హత్యలు, దోపిడీ ల్లోనూ ఉంటున్నారు.. యాజమాన్యాలు విద్యార్థులను కట్టడి చేసే పరిస్థితులు కనిపించడం లేదు. నెల్లూరు నగరంతో పాటు, ఇతర ప్రాంతాల్లో మద్యంషాపులు, దాబాల్లో విద్యార్థులు మత్తులో కనిపిస్తున్నారు... నారాయణ, ఆదిశంకర, గీతాంజలి, వెంక టేశ్వర ఒక్కటేమిటి అన్ని కాలేజీల్లోనూ ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పరిస్థితి ఇలానే ఉంటే విద్యాలయాల నుంచి విద్యార్థులు కాకుండా అరాకచక శక్తులు సమాజంలోకి వస్తుందనడంలో సందేహం లేదు. చదువుకో డానికి వస్తున్న విద్యార్థులకు ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

- మద్యం, డ్రగ్స్, గంజాయి విచ్చలవిడి
- రౌడీ గ్యాంగ్‌లు హల్‌చల్
- యాజమాన్యాలు చేయిదాటిపోతోన్న పరిస్థితి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు విద్యకు ఒకప్పుడు రాష్ట్రంలోనే ప్రధాన కేంద్రంగా ఉండేది. రత్నం, నారాయణ విద్యా సంస్థల్లో చదువుకోడానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చేవారు. ప్రస్తుతం నెల్లూరు విద్యాలయాల్లో విష సంస్కృతి కనిపిస్తోంది. ఇంజినీరింగ్ కాలేజీలు ఒకప్పుడు జిల్లా వ్యాపితంగా ఇరవై వరకు ఉన్నాయి. ప్రస్తుతం పదిలోపే అందు బాటులో ఉన్నాయి. మిగిలినవి మూతపడ్డాయి. ఇటీవల కాలంలో ఇంజినీరింగ్ విద్య, డిగ్రీకన్నా దారుణంగా మారింది. ఎలాంటి పరిజ్ఞానమూ లేని విద్యార్థులందరూ ఇంజినీరింగ్ కాలేజీల్లో దర్శమిస్తున్నారు. పదేళ్ల క్రితం మంచి పేరు తెచ్చుకున్న ఇంజినీరింగ్ కాలేజీల్లో గ్యాంగ్‌లు తయారయ్యాయి. మద్యం అందుబాటులోకి రావడంతో ప్రధాన ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎక్కువ మంది మద్యానికి బానిసలైపోతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నారాయణ ఇంజినీరింగ్, ఆదిశంకర, వెంకటేశ్వర, గీతాంజలి, ఆత్మకూరు ఇంజినీరింగ్, ఎన్‌బికెఆర్‌తోపాటు మరికొన్ని కాలేజీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు పంపిన డబ్బులతో కొందరు విద్యార్థులు సాయంత్రం అయితే బార్లు, డాబా ల్లోనూ, శివారు ప్రాంతాలు, రూమ్‌ల్లో మద్యం సేవించి దర్శనమిస్తు న్నారు. మత్తులో విద్యార్థుల మధ్య నిత్యం గొడవలు సాగుతున్నాయి. చదువుకో వాలని వచ్చిన విద్యార్థులకు ఆ బ్యాచ్‌లతో ఇబ్బందులు పడుతున్నారు. కేవలం మద్యం కాదు. గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రాలుగా విద్యాలయాలు మారుతున్నాయని పోలీసు విచారణలోనూ తేలింది. యజమాన్యాలు విషయం తెలిసినా ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. గ్యాంగ్‌లుగా మారి దాడులకు దిగుతున్నారు. చదువును పక్కన పెట్టేసి సాయంత్రమైతే రోడ్ల మీద దర్శనమిస్తున్నారు. దొంగతనాలు, దోపిడీలు, దాడుల్లోనూ కొందరి విద్యార్థుల ప్రమేయం ఉంటుందని తెలుస్తోంది. తల్లిదండ్రులు కష్టపడి, అప్పులు చేసి పంపుతోన్న డబ్బులతో ఎంజాయ్ చేస్తున్నారనే తెలుస్తోంది. మద్యానికి బానిసలైన కొందరు విద్యార్థులు చెడుదారులు తొక్కుతున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లో విష సంస్కృతి పెరిగిపోతోంది. ఇటీవల ఓ ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవంలో గ్యాంగ్‌లు దాడులకు దిగి తలలు పగలగొట్టుకున్నారు. మద్యం సేవించి హల్‌చల్ చేశారు.



రౌడీ గ్యాంగ్‌లు హల్‌చల్...!

ఒకప్పుడు విద్యాలయాల్లో విద్యార్థులు సమాజానానికి ఉపయోగపడే విద్యార్థి సంఘాల్లో నాయకులుగా, కార్యకర్తలు పనిచేశారు. ప్రస్తుతం విద్యార్థి సంఘాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో గ్యాంగ్‌లుగా మారి కాలేజీలోనూ, బయట రౌడీ గ్యాంగ్‌లుగా మారుతున్నారు. నెల్లూరు నగరంలో రౌడీ షీటర్లు వివిధ కాలేజీల్లో గ్యాంగ్‌లు నడుపుతున్నాయి. నారాయణ, కృష్ణచైతన్య, జగన్, ఆదిత్య, ఒక్కటేమిటి అన్ని కాలేజీల్లోనూ బయట వ్యక్తులు గ్యాంగ్‌లు నడుపుతున్నారనే విమర్శలున్నాయి. రాజకీయ పార్టీల మీటింగ్‌లు, బయట గొడవలకు ఇక్కడ నుంచి విద్యార్థులను సమీకరిస్తున్నారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీ చోటా నాయకులు కాలేజీల్లోని విద్యార్థులను తమ రాజకీయాలకు ఉపయోగిస్తున్నారు. కాలేజీల్లో బయట రౌడీల గ్యాంగ్‌లు తయారవుతున్నాయి. నేను ఆ గ్యాంగ్, నేను ఈ గ్యాంగ్ అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. రాజకీయపార్టీల మీటింగ్‌లకు ఏ కాలేజీ నుంచి ఎంతమంది విద్యార్థులు రావాలి, ఎవరి గ్యాంగ్, ఎంత వాటా అంటూ విద్యాలయాల్లో విష సంస్కృతి వస్తుంది. కొందరు చదువుకుంటున్నా కొందరు ఇలా చెడుమార్గంలో నడుస్తున్నారు. యాజమాన్యాలకు తెలిసిన ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు విద్యా సంస్థల యజమానులు రాజకీయాల్లోకి రావడం కూడా విద్యార్థులు గ్యాంగ్‌లకు ఊతమిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మద్యం, డ్రగ్స్, గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. కౌన్సెలింగ్ ఏర్పాటుచేసి, రౌడీ మూకల వలలో చిక్కుకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకోడానికి పంపితే ఇలా చెడు వ్యసనాలకు, రౌడీ మూకలతో తిరుగుతుండడంతో తల్లిదండ్రులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలానే వదిలేస్తే విద్యాలయాల నుంచి విష నాగులు బయటకొస్తాయనే భయం కనిపిస్తోంది. పోలీసులు, కాలేజీ యాజమాన్యాలు చొరవ తీసుకోవాల్సి ఉంది.

మోడల్ స్కూల్ పరీక్ష 21కి వాయిదా

ప్రజాశక్తి-కందుకూరు

ఏపీ మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21కి వాయిదా వేసినట్లు జి మేకపాడు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గురుదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు మండలం జిమేకపాడు లో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ కు ఈనెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. 20వ తేదీ ఈస్టర్ పర్వదినం కావడంతో 21వ తేదీకి మార్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 21వ తేదీ పరీక్షకు హాజరు కావాలని తెలియజేశారు. పరీక్ష ఉదయం 10నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు

తేదీ 12-04- 2025న 33 కె.వి గుడ్లూరు ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించుటకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు ఈ ఫీడర్ నందు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కందుకూరు అసిస్టెంట్ ఇంజినీర్ టివి నరసింహం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి కొండ ముడుసు పాలెం, మోపాడు, మాచవరం పరకండపాడు,శ్రీరంగ రాజ పురం,మదన గోపాలపురం, పాలూరు,దొండపాడు, సినిగే వారి పాలెం గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.వ్యవసాయ విద్యుత్ సప్లై మధ్యాహ్నం 01:00 తర్వాత ఇవ్వబడును. వినియోగదారులు గమనించగలరు

మహిళలకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తోటపల్లిగూడూరు మండలం కృష్ణారెడ్డి పాలెం గ్రామంలోని మహిళలతో శుక్రవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 12 మందితో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్షురాలిగా కందిపాటి రమణమ్మ, కార్యదర్శిగా దామవరపు ఉషాలను ఎన్నుకోవడం జరిగింది. కృష్ణారెడ్డి పాలెం గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహిళలకు పని కల్పించడం లేదని, అధికార పార్టీ నాయకులు ఎవరికి చెబితే వారికి మాత్రమే ఉపాధి జాబ్ కార్డులు ఇస్తున్నారని, ఇది పద్ధతి కాదని, అర్హులైన పేద మహిళలందరికీ కూడా ఉపాధి కల్పించాలని మహిళా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు టి శివకుమారి. కార్యదర్శి షేక్ మస్తాన్‌బీలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పూలే దంపతులను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి


:సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

జ్యోతిరావు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని సామాజిక వివక్షతకు, అసమానతలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో యువతరం మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు.శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జ్యోతిరావ్‌పూలే సేవలు ప్రజల మనస్సులో నేటికి నిలిచి ఉన్నాయన్నారు. దేశంలో అంటరానితనం, నిరక్షరాస్యత ,సామాజిక వివక్షతలు ఉన్నంత కాలంలో పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటారన్నారు. కుల వివక్షతకు, అంటరానితనానికి, నిరక్షరా స్యతకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని చేపట్టి వాటన్నింటిని నిర్మూలించన రోజే పూలే దంపతులకు నిజమైన జోహార్లు అర్పిం చినట్లున్నారు. నేటికీ తీవ్రమైన రూపాల్లో గ్రామాల్లో, పట్టణాల్లో కులవివక్షత కొనసాగుతుం దన్నారు. ఆ రోజుల్లోనే ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా అన్ని రకాల కులాల్లో అణగారిన వర్గాలను కూడగట్టి పోరాటం చేసిన గొప్పతనం పూలే దంపతుల దన్నారు. దళితుల విముక్తి కోసం పోరాటం చేయాలని పిలుపుని చ్చారన్నారు. విద్యతోనే ఈ విముక్తి సాధించ గలమని గట్టివాదాన్ని సమాజానికి వినిపించిన మహోన్నత వ్యక్తి పూలే అని, అటువంటి వ్యక్తిని నేటితరం యువత ఆదర్శవంతంగా తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో అధికారంలోని బిజెపి ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో కులవ్యవస్థకు లేని గౌరవాన్ని ఆపాదించి, దానిని పునరుద్ధరించి ఈ అంటరానితనాన్ని సనాతన ధర్మం పేరుతో కాపాడాలని ప్రయత్నం చేస్తుందన్నారు.అదే పద్ధతిలో దళితులకు , గిరిజనులకు వారి విజ్ఞానతకు, చదువుకొనేందుకు ఉన్న అవకాశాలను తగ్గించేస్తుందన్నారు. మత ఘర్షణల పేరుతో దేశాన్ని బలహీన పరుస్తూ బిజేపి ప్రభుత్వానికి, దాని మిత్రపక్షాలకు జ్యోతిరావుపూలే దంపతులకు నివాళి అర్పించే అర్హత లేదన్నారు. ఈ పాలకులను ఇంటికి సాగనంపినప్పుడు మాత్రమే ఈ భారత దేశం ముందడుగు వేస్తుందన్నారు. అమెరికా ప్రభుత్వం భారతదేశ ప్రజలమీద విచ్చలవిడిగా ఆంక్షలు పెడుతున్నా పాలకులు నోరు మెదపకుండా భారత దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన టువంటి ఘనత ఈ మోడీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇటువంటి అంక్షలు అనాటి బ్రిటీష్‌పాలనులో ఉంటే వాటిని ఎదిరించి నిలబడిన స్వాతంత్ర్యోదమ నాయకులకు ద్రోహం చేయడం సరికాదన్నారు.


అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ విద్యను ప్రతి ఒక్కరికీ అందించాలన్న ఆశయంతో పూలే దంపతులు అడుగులు వేశారన్నారు. వివక్షతకు వ్యతిరేకంగా నిలబడిన సమయంలో అనేక మంది పూలే దంపతులపై దాడులకు పాల్పడినప్పటికీ అధైర్యం చెందకుండా ముందుకు పయనిస్తూ అందరికీ విద్యనందించారన్నారు.జిల్లాలో వివక్షతకు వ్యతిరేకంగా నిలిచి దళితులకు అండగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య ఈ జిల్లాకు చెందిన వాడే అని, తన పేరులో రెడ్డి అన్న పదాన్ని కూడా తొలగించుకొని ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అదే కోవకు చెందిన వ్యక్తి జక్కా వెంకయ్య అని పేర్కొన్నారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, షేక్ మస్తాన్‌బీ, సిపిఎం నగర , రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, జి. నాగేశ్వరరావు, రూరల్ కమిటీ సభ్యులు అజీజ్, కె.సి పెంచలనర్సయ్య, ఎన్.మాలకొండయ్య, పి.సూర్యనారాయణ, ఎం.రాజ, ఎం.పుల్లయ్య, మూలివెంగయ్య, కటికాల సుబ్రహ్మణ్యం



నినాదాలు చేస్తున్న నాయకులు

వేతనాలు నిలుపుదల విడ్డూరం..

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు, కార్మికులకు గడిచిన రెండు నెలల నుంచి వేతనాలు అందజేయలేదని, రాష్ట్రమంతా మున్సిపల్ కార్మికులకు వేతనాలు అందజేస్తే మున్సిపల్ శాఖ మంత్రి ప్రాతినిత్యం వహిస్తున్నటువంటి ప్రాంతంలో మున్సిపల్ కార్మికులకు మాత్రమే వేతనాలు ఆపడం విడ్డూరంగా ఉందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులతో కలిసి సామూహిక అర్జీ సమర్పించిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణం నుండి కార్మికులు, ఉద్యోగులు యూనియన్ నాయకులతో కలిసి కార్యాలయంలోకి వెళ్లి కమిషనర్ లేకపోవడంతో నగరపాలక సంస్థ మేనేజర్ ఇనాయతుల్లాకి సమస్యలతో కూడిన అర్జీని సమర్పించి,పరిస్థితిని సమస్యల తీవ్రతను వివరించారు. అనంతరం కార్పోరేషన్ కార్యాలయం బయట మీడియాతో యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచల నరసయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు మాట్లాడారు.రాష్ట్రంలో ఎక్కడ జీతాల బకాయిలు లేవని, మున్సిపల్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నగరపాలక సంస్థలో రెండు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 30 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న 93 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండాయ అనే పేరుతో ఏ నోటీసు లేదా ఉత్తర్వులు లేకుండా నోటి మాటతో నిర్లక్ష్యంగా పనుల నుండి నిలిపి వేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు.. మున్సిపల్ శాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరిం చారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాలకొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు, కామాక్షమ్మ,సుజాతమ్మ, తాళ్లూరు లోకేష్, సలోమి పాల్గొన్నారు.


మహీధర్ రెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు

సాయితత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-కందుకూరు: సాయితత్వాన్ని అందరూ ముందుకు తీసుకెళ్లాలని మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర శ్రీ షిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షులుగా మానుగుంట మహీధర్ రెడ్డి ఎన్నికవ్వడంతో శుక్రవారం ఆయన అనుచరులు మహీధర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహీధర్ రెడ్డి మాట్లాడుతూ సాయి తత్వాన్ని అందరూ ఆచరించే విధంగా ముందుకు తీసుకెళ్లాలి అన్నారు. అందరూ ఆధ్యాత్మికతవైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటూరి హరిబాబు, తొట్టెంపూడి శ్రీనివాసులు, కుమ్మర బ్రహ్మయ్య, గంగవరపు వెంకటరావు, ఇంటూరి మాధవరావు, ఎల్. శ్రీనివాసులరెడ్డి, గోసల వెంకారెడ్డి, పబ్బిశెట్టి శివ, ఉన్నం వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, మాలకొండా రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కందుకూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈసంఘటన కందుకూరు మండలం, ఓగూరు కోల్డ్ స్టోరేజ్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. లారీ బైకును ఢీకొనడంతో ఓగూరు గ్రామానికి చెందిన గంగారపు వెంకటేశ్వర్లు (42) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.మృతదేహాన్ని కందుకూరు ఏరియా ఆసుపత్రికి శవపరీక్ష నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల అంబేద్కర్‌కు నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్134వ జయంతి సందర్భంగా కందుకూరు పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏపడి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ, దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యం ఈనె 1నుండి 13వ తారీకు వరకు జరుగుతున్న నివాళులు అర్పించు కార్యక్రమంలో భాగంగా 11వ రోజు శుక్రవారం కందుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి.శ్రీధర నాయుడు మాట్లాడారు. జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగరాజు పవన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు వై సాంబశివరావు, ముప్పవరపు కిషోర్, పోకూరి కోటయ్య,షేక్ షంసుద్దీన్, దారా మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ప్రజాశక్తి-కందుకూరు

భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ప్రతినిధి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 జయంతి సభ విజయవంతం కావాలని మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఆకాంక్షించారు. ఏ ఏ డి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న అంబేద్కర్ విగ్రహం వద్ద జరగనున్న జయంతి కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరిస్తూ బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు.కార్యక్రమంలో ముప్పవరపు కిషోర్, చనమాల కోటేశ్వరరావు, గాండ్ల హరి ప్రసాద్ వైసీపీ నాయకులు తోకల కొండయ్య పాల్గొన్నారు.



పోస్టర్ అవిష్కరిస్తున్న బుర్రా

పౌష్టికాహార మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్

మండలంలో తెట్టు సెక్టార్ లోని చేవూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్‌లో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. .చిన్నపిల్ల ల్లోని ఇన్ఫెక్షన్ రాకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉలవపాడు ప్రాజెక్ట్ సి.డి.పి.ఓ టి.అరుణ కుమారి మాట్లాడుతూ చిన్న పిల్లలు చేతులు శుభ్రంగా కడుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తల్లులు చిన్న పిల్లలకు వ్యక్తిగత శుభ్రతను నేర్పించాలన్నారు. హ్యాండ్ వాష్ పై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కామేశ్వరి. అంగన్వాడీ కార్యకర్తలు పి .హేలేన్ కుమారి. కే.నళిని. కే సునీత గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, .తల్లులు. పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సి.డి.పి.ఓ టి.అరుణ కుమారి

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ వీరేంద్ర బాబు సమాచారం మేరకు.. మండలంలోని విలుకానిపల్లి గ్రామానికి చెందిన అంబూరి ప్రసాద్ (40) ఈ నెల 8వ తేదీన తన మోటర్ బైక్ పై పనికి వెళ్ళి, తిరిగి సాయంత్రం గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నెల్లూరు వైపు వస్తున్న గుర్తు తెలియని లారీ బైక్ ను అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు బలమైన రక్త గాయాలయ్యాయి. దాంతో చికిత్స నిమిత్తం ప్రసాద్ ను నారాయణా హాస్పిటల్లో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ప్రసాద్ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల పూలే జయంతి వేడుకలు


కందుకూరులోని టిడిపి ఆధ్వర్యంలో


కెవిపిఎస్ ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం మహాత్మ జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని కోవూరు రోడ్‌లోని పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతీరావు పూలే జీవిత పోరాటం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వరు, చిలకపాటి మధుబాబు, అధ్యక్షులు ముచ్చు వేణు, చదలవాడ కొండయ్య, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–కందుకూరు

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని రూరల్ పోలీస్ దగ్గర ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహంకు పూలమాలవేసి మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైసిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నివాళులర్పించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో

భారత సమాజంలో అణగారిన వర్గాలకు విద్యతోపాటు స్వేచ్ఛ స్వాతంత్రం హక్కుల స్వాలంబన కోసం తుది శ్వాస వరకు క్షమించిన మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నియోజవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పట్టణ పరిధిలో కోవూరు రహదారిలో గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాల కొండయ్య మాట్లాడారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆనందమోహన్, దుర్గాప్రసాద్, బాల బ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు పునికి పుచ్చుకొని ఆయన బాటలో అందరూ నడవాలని గుడ్లూరు మండలం సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు అన్నారు. బస్టాండ్ సెంటర్లో మల్లికార్జున అధ్యక్షతన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా శుక్రవారం జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐ మంగారావు ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ప్రజాశక్తి-నెల్లూరు

భారతదేశ సామాజిక విప్లవకారుడు జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ గత 150 సంవత్సరాల క్రితమే భారతదేశం లోని కుల వివక్ష అంటరానితనం, అసమానతనలను రూపుమాపేందుకు ఆనాటి బ్రాహ్మణ ఆదిపత్యం పై పోరాడి సమ సమాజ స్థాపన కోసం కృషిచేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు.కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గంప సుధీర్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ అల్లాడి గోపాల్ ,పచ్చ కిరణ్ నందిపాటి మాలకొండయ్య శ్రీపతి వెంకయ్య, నూకలపాటి. మోహన్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, మల్లె సింహగిరి పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో

నగరంలోని విద్యుత్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. శుక్రవారం విద్యుత్ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ బాలచంద్ర, శ్రీధర్‌లు ముఖ్యఅతిధులుగా పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమం లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్ , అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు విద్యార్థులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర రావు విద్యార్థులు పాల్గొన్నారు

ప్రజాశక్తి- ఉలవపాడు : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం స్థానిక ఎం.ఆర్.సి కార్యాలయంలో ఉలవపాడు మండల బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పలువురు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రమణయ్య , ద న్యాసి.శోభన్ బాబు, ఎం. భాస్కరరావు, ఎస్. భాస్కరరావు, ఎస్.కె బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటం



నినాదాలు చేస్తున్న ముస్లిం నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు

వక్ఫ్ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరతూ కందుకూరులో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది.కందుకూరు అంబేద్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ముస్లిం మైనారిటీలు, మహిళలు, పలు ప్రజాసంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదటగా స్థానిక అంబేద్కర్ విగ్రహం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం లౌకిక రాజ్యాంగాన్ని కాపాడాలని, 2025 చట్టాన్ని రద్దు చేయాలని నినాదాలతో సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం సబ్ కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి వక్ఫ్ చట్టంలోని అభ్యంతరాలను తెలిపారు. సబ్ కలెక్టర్ శ్రీపూజ సానుకూలంగా స్పందించి మేము ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. అనంతరం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ చట్టాన్ని అమలు చేయడం ద్వారా తమ హక్కుల్ని కాలరాస్తున్నారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని అమలు చేయడం ద్వారా ముస్లిములకు ఉన్న హక్కులని పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం హరిస్తుందన్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే ముస్లిములకు ఖబర్‌స్థానాలు కూడా ఉండవన్నారు. ముస్లిమేతరులని ఈ కమిటీలలో పెట్టడం ద్వారా రాజ్యాంగంలోని హక్కులను హరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశానికి మంచి చేయడం మర్చిపోయి ముస్లిములను టార్గెట్ చేయడం ద్వారా కొత్త కొత్త చట్టాలను, చట్ట సవరణలు చేసి వారిని మరింత అణిచివేతకు గురి చేస్తుందన్నారు.కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎస్ఎ గౌస్, పి మాల కొండయ్య, ఎస్.కె మున్వర్ సుల్తానా ,బూసి సురేష్ ,మహిళా సంఘం నాయకులు ఎస్.కె మల్లిక ,ఎం పద్మ,షాహీదా, సిఐటియు నాయకులు ఎస్ పవన్ కుమార్ ,లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యులు ఎస్కే అస్మా ,కందుకూరు పట్టణ ముస్లిం నాయకులు ఎండి నసీర్,సంధాని,మాబాషా, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

- సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : అయ్యప్ప గుడి వద్ద ఉన్న ఉడ్ కాంప్లెక్స్ పరిధిలో దాదాపు 30 సంవత్సరాల నుంచి నివాసం ఉన్న 25 దళిత కుటుంబాలను డ్రైన్, రోడ్ల విస్తరణ పేరుతో అర్థాంతరంగా తొలగించడాన్ని నిరసిస్తూ, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఏపీ ఐఐసి జనరల్ మేనేజర్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ వుడ్ కాంప్లెక్స్ పరిధిలో దాదాపు 25 దళిత కుటుంబాలు పార్కు పక్కన, రోడ్డు మార్జిన్‌లో నివాసం ఉంటూ చెక్క పని చేసుకుంటూ కుర్చీలు, బల్లలు, కట్టెపీటలు, చిన్న పీటలు వంటి వస్తువులు తయారుచేసి వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎటువంటి ప్రత్యామ్నాయం చూపించకుండా రోడ్ల విస్తరణ పేరుతో అర్థాంతరంగా వారి బంకులను, గుడిసెలను తొలగించడం వలన రోడ్డు పాలయ్యారు. అర్థాంతరంగా ఖాళీ చేయించడం వలన వారి బిడ్డల చదువులు కూడా ఆగిపోయే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే. పెంచల నరసయ్య, ఎన్. మాలకొండయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, బాధితులు పాల్గొన్నారు.



పాఠశాలను మార్చొద్దని విజ్ఞప్తి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని పంచాయతీ ఆఫీస్ సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇక్కడే 1 నుంచి 5వ తరగతి వరకు ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ పాఠశాలలో 1, 2 తరగతులు ఏర్పాటు చేసి మిగిలిన 3,4,5 తరగతులను ఇక్కడి నుంచి రాను పోను కిలోమీటర్ దూరంలో ఉన్న వేరే పాఠశాలకు కలుపుతున్నారని, దానికి తాము అంగీకరించమన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని అధికారులు తప్పనిసరిగా ఈ ప్రాంతంలోనే 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ఉండేలా సహకరించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తల్లిదండ్రులు లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు ఉన్నారు.

సభ్యత్వ కార్డుతో ఆర్థిక భరోసా



ప్రజాశక్తి-వరికుంటపాడు : టిడిపి సభ్యత్వం తీసుకున్న ప్రతీ కుటుంబంలోనూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని మాజీ ఎంపిపి సుంకర వెంకటాద్రి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సుంకర అంజనాద్రి అన్నారు. మండల కేంద్రమైన వరికుంటపాడులోని సుంకర వెంకటాద్రి అతిథి గృహంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ కార్డులను భూత్ ఇన్‌చార్జి పాద మాధవరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత మంత్రి నారా లోకేష్ బాబు కార్యకర్తల సంక్షేమం కోసం ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ఏదైనా మరణం సంభవిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, ఆంధ్రా శివారెడ్డి, లింగం మాలకొండయ్య, సరాబు లక్ష్మీనారాయణ, నల్లగొర్ల వెంగళరావు, మద్దినేని మధుబాబు, సుంకర వెంకటేశ్వర్లు, సుంకర హరినాథ్ బాబు, షేక్ పేరయ్య టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు దళితవాడ వద్ద అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు అంబేద్కర్ పూర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోవూరులో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు కోవూరు బజార్ సెంటర్ నుంచి చర్చి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలు, మైనారిటీ వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు. టి.ఎడుకుమార్, యస్.శ్రీనివాసులు, డేవిడ్ జాన్సన్, బి. శ్రీధర్, ఏ.సింహాద్రి, ఎం.సుధాకర్, టి.టోని ఉన్నారు.

కిట్లు పంపిణీ



ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పైలేరియా వ్యాధిగ్రస్తులైన రోగులకు ఎంఎండిపి కిట్లను ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులను వేసుకోవడమే కాకుండా ఈ బోదకాలు మరింత వ్యాప్తి చెందకుండా ఉపయోగించుకుంటూ తప్పనిసరిగా వాడుకోవాలన్నారు. అనంతరం ఫైలేరియా కిట్లు వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కె ఇలియాజ్, ఎఎన్ఎం రమణమ్మ, ఆశాలు ఉన్నారు.

కుట్టు మిషన్ బహూకరణ



ప్రజాశక్తి-కావలి : దగదర్తి మండలం, ఉలవపాళ్ళ మాజీ సర్పంచ్ పోలిశెట్టి శ్రీనివాసులు వారి తల్లి పోలిశెట్టి బుజ్జమ్మ జ్ఞాపకార్థంగా కావలి పట్టణం తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళల్లో ఒకరైన షేక్.సహన అనే నిరుపేద మహిళకు సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు మిషను వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ గౌరవ సభ్యులు విశ్రాంత లెక్చరర్ బుర్లా రఘు కుమార్ రెడ్డి, విశ్రాంత లెక్చరర్ ఎంవిఎస్ ప్రసాద్ రావు, విశ్రాంత బిసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ బాషా, ప్రధానోపాధ్యాయులు నేలటూరి శివప్రసాద్ రెడ్డి, సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరో మన్ననలు పొందారని తెలిపారు.

బెల్ట్ షాపు యజమానులు అరెస్టు

ప్రజాశక్తి-కోవూరు : మద్యం బెల్టు దుకాణాల నిర్వాహకుల ఆట కట్టించాలని మహిళలు శుక్రవారం ఎక్సైజ్ అధికారులను కోరిన వెంటనే ఎక్సైజ్ సిఐ కిషోర్ స్పందించారు. పాటూరు, గుమ్మళ్లదిబ్బ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పాటూరుకు చెందిన జి.సుజాత, మేనాటి బాలకృష్ణ నుంచి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1నుంచి ఇప్పటి వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్న 61 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. 25 మంది పాత నేరస్తులను తహశీల్దార్ ఎదుట హాజరుపరచామన్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లోని గ్రామాల్లో నిరంతరం దాడులు చేసి అనధికారిక మద్యం విక్రయాలను అడ్డుకుంటున్నామన్నారు. గంజాయి, నాటుసారా, అనధికార మద్యం విక్రయాలపై తమ ఫోన్ 9440902524 నెంబర్‌కు సమాచారమిస్తే వెంటనే స్పందిస్తామన్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడులోని శ్రీ సాయినాథుని ఆలయంలో శుక్రవారం ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి సుజనా దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం నుంచి శ్రీ సాయినాథునికి పాలాభిషేకం తదితర రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, సకల దేవత మండపారాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త సుంకర వెంకటాద్రి, సుజనా దంపతులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి సుంకర అంజనాద్రి దంపతులు పాల్గొన్నారు. టిడిపి మండల కన్వీనర్ చండ్ర మధుసూదన్ రావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, యువ నాయకులు అరికొండ వెంకటరత్నం, లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుంకర వెంకటాద్రి, పాద మాధవరావు తాలూకా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి



ప్రజాశక్తి-వరికుంటపాడు : ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నె సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కృష్ణ (38) ఉదయగిరి మండలం నుంచి ఇటుకలోడు వేసిన ట్రాక్టర్ పామూరుకు వచ్చాడు. పామూరులో అన్‌లోడ్ చేసి తిరిగి వెళుతుండగా తిరగలదిన్నె సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ట్రాక్టర్ పై నుండి అదుపు తప్పి కిందపడ్డాడు. ట్రాక్టర్ చక్రం పైకి ఎక్కడంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. పామూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి పాప, బాబు, భార్య ఉన్నారు.

మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారాంపురం : ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కర్ రావు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, దుర్గయ్య, నాగేష్, ఎడమ ప్రవీణ్, కిరణ్, శేఖర్, అప్పా ప్రభాకర్ రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు అనంతరం ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యాలయం సిబ్బంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి, బహుజన చైతన్య దీప్తి, వివక్షలపై పోరాడి,మహిళా విద్యకు విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కావలి టిడిపి కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.సి.ఐక్యభవన్ వారి సహకారంతో బ్లడ్ వారియర్స్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 40మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి జనసేన కావలి ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, బి.సి. ఐక్యత భవన్ ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద రావు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సహాయ కార్యదర్శి ముక్కు మురళీమోహన్, బి.సి.ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉరిటి గోవిందు,హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ పద్మావతి, రక్త కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయవాణి, డాక్టర్ రోహిత్ కర్ణాటి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



యు.టి.ఎఫ్. ఆధ్వర్యంలో.. యుటిఎఫ్ ఆధ్వర్యంలో కావలి పట్టణములో బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, సామాజిక విప్లవ కారులు, సంఘ సంస్కర్త, నిరాడంబరులు, విద్యావేత్త, మహాత్మ జ్యోతిరావుపూలె జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

సిపిఐ ఆధ్వర్యంలో కావలి అభ్యుదయ వాది సంఘ సంస్కర్త బడుగు బలహీన వర్గాల దార్శనికుడు మాహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి కె నాగరాజు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో : మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల పూలే విగ్రహానికి జనసేన పార్టీ కావలి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్, నాయకులు, వీర మహిళలలతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొబ్బా సాయి, శ్రీను, సుధీర్, బాలు, మస్తాన్, ఆగస్టీన్, కళేబు, మండా శ్రీను, సాదు శ్రీధర్, పవన్, గోవిందు, అరుణ్, కిరణ్, దినకర తేజ, వెంకయ్య బాబు, వెంకయ్య, వెంకటేశ్వర్లు, గిరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో.. బిజెపి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో కావలి ఒకటవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సివిసి సత్యం, గుండ్లపల్లి భరత్ కుమార్, బెల్లంకొండ మాల్యాద్రి, అమర వెంకట సుబ్బారావు, వాయుగుండ్ల వెంకట సుధీర్, సుందరశెట్టి సుజి, గుడిపల్లి ప్రసన్నకుమార్, కోడూరు మురళీకృష్ణ, మంద శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సి.హెచ్. శ్రీదేవి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : పోలీస్ స్టేషన్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : బాలికల కోసం మొట్టమొదటి పాఠశాలను 1848 సంవత్సరంలో పూణేలో స్థాపించిన సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని తహశీల్దార్ నిర్మలానందబాబా కొనియాడారు. తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆ మహాత్ముని జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్రావు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సుధా, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఎంపిడిఒ నగేష్ కుమారి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎంపిడిఒ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఎంపిడిఒ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హౌసింగ్ ఎఇ వివేక్ కార్యాలయ సిబ్బంది ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిగా ఆయన చిత్రపటానికి పూలమాల చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలె అని మండల టిడిపి అధ్యక్షులు మాలపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఎల్ సుధీర్ బాబు, జిల్లా కార్యదర్శి కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, శివ కటయ్య, పోతల సీనయ్య, ,దేవరాలతిరుపతి, శ్రీనివాసులు రెడ్డి, గండుపల్లి సీనయ్య, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, జిల్లా నాయకులు కాంట్రా రఘురాం నాయుడు, ఎల్, కిషోర్ బాబు, ధన్యాసి శ్రీధర్, రామ్మోహన్ రెడ్డి, రావి విజయ్ యాదవ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.



పులి జాడలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపేట శివారులో పులి సంచారం

ప్రజాశక్తి-దుత్తలూరు

మండలంలోని నర్రవాడ - కొత్తపేట గ్రామ శివారు ప్రాంతంలో పులి సంచరిస్తుందని గ్రామస్తులు ఆటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దాంతో డిఆర్ఒ మురళి, ఎఫ్‌బిఒ ప్రసాద్ గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ శివారులో పశువుల దొడ్డికి అనుకొని ఉన్న ప్రాంతంలో బహిర్భుమికి వెళ్లిన వారికీ పులి కనిపించిందని గ్రామస్తులు తెలిపారు. దాంతో ఆటవీశాఖ అధికారులు పులి పాదముద్రాల కోసం పలు ప్రాంతలను పరిశీలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని జీతాలు

ప్రజాశక్తి-ఎఎస్ పేట

మండల పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇంతవరకు వేతనాలు అందలేదని పత్రికాముఖంగా వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఉపాధి లేని ప్రజలకు, నెలనెల ఉపాధి కల్పిస్తూ వారికి సంబంధించిన మస్టర్లు వేస్తూ, మండలంలోని ఇతర పనులను సైతం చేస్తున్న మాకు ఇంతవరకు వేతనాలు రాలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని సంబంధిత ఎపిఎం అని అడగ్గా గత సంవత్సరం మార్చి చివరికి జీతాలు వస్తూ ఉండేవని, కానీ ఈ సంవత్సరం జాప్యం జరిగింది మాత్రం వాస్తవమేనని బిల్లులు పెట్టి ఉన్నామని త్వరలో అందుతాయన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి వైభవంగా హనుమంత సేవా కార్యక్రమం నిర్వహించారు. ధర్మకర్తలు ఘనప సుదర్శన్ రెడ్డి, ఆలయ ఇఒ ఉత్సవ కార్యక్రమాలను పరిశీలించారు. భక్తులందరికీ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.



తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్న రైతులు

పంటను దూరం చేయొద్దు సారూ..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

పంట దక్కకపోతే తమకు మరణమే శరణ్యమని మండలంలోని జగదేవిపేట వృద్ధ రైతు దంపతులు పామూరు కృష్ణారెడ్డి, పామూరు పద్మావతమ్మ వాపోయారు. శుక్రవారం జగదేవిపేటలోని వారి పొలంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన చిన్న కుమారుడు పామూరు రమేష్ కుమార్తె పేరుపై రాసిన రెండు ఎకరాల పొలంలో తాము వరివేసి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. పంట చేతికొచ్చి కోసేలోపు కొంతమంది స్థానిక నేతలు అండతో తమ కోడలు తమపై తప్పుడు కేసులు బనాయించి పంటను తమకు దక్కకుండా చేస్తుందన్నారు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల మాటలు విని తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నారు పోసి దుక్కిదున్ని పంట కోసే సమయంలో కావాలని స్థానిక నేతలు అధికారుల అండదండలతో పంటను తమకు దక్కనివ్వకుండా చేస్తున్నారన్నారు. తమపంట తమకు దక్కకుంటే తమకు చావే దిక్కన్నారు. ఎంతో అప్పు చేసి మరి పొలం వేస్తే నోటి దగ్గర పంటను లాక్కోవడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.



చెత్తబుట్టలు అందజేస్తున్న ఎంపిడిఒ

మన్నంగిదిన్నెలో చెత్త సేకరణ

ప్రజాశక్తి-కావలి

మన్నంగిదిన్నె గ్రామపంచాయతీలో శుక్రవారం ఎం.పి.డి.ఒ. సిహెచ్. శ్రీదేవి ఆధ్వర్యంలో ఇంటింటికి చెత్తను సేకరించే కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్త వేరువేరుగా ప్రతిరోజు ఇంటి వద్దకు వచ్చే పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాల్సిందిగా తెలియజేశారు. గ్రామాలను చెత్త లేకుండా అపరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విస్తరణ అధికారి సమద్, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

రైతుసంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మర్రిపాడు

అఖిల భారత కిసాన్ సభ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకూరు పేట, లేబూరు, ఆత్మకూరు, మర్రిపాడు, దామరమడుగు, తిక్కవరం, తదితర గ్రామాల్లో రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించామన్నారు. దున్నే వాడికే భూమి ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలనే నినాదంతో 1936 ఏప్రిల్ 11న రైతుసంఘం ఏర్పడిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పడగా అధ్యక్షులుగా స్వామి సహజానంద సరస్వతి కార్యదర్శిగా ఎన్‌జి రంగాను ఎన్నుకున్నట్లు తెలిపారు. మూడు డిమాండ్లపై పనిచేయగా భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, జమిందారీ విధానాన్ని రద్దు చేయాలని, సామాజిక న్యాయం కావాలని ఆనాడు రైతుసంఘం ఏర్పడిందన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుండి తడ వరకు 1512 మైల్లు పాదయాత్ర చేసి గ్రామగ్రామాన తిరిగిరైతు సమస్యలపై పోరాటం చేశారన్నారు. దానిలో భాగంగానే జమిందారీ విధానాన్ని రద్దు చేసి దున్నేవానికి భూమి వచ్చి వ్యవసాయ చేసుకుంటున్నారని తెలిపారు. దేనికోసం పోరాటం చేసి సాధించుకున్నామో.. నేడు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, పిల్లలను చదివించలేక, ఆరోగ్య పరిస్థితులు చక్క దిద్దుకునే పరిస్థితులు లేవన్నారు. వ్యవసాయం లాభాల్లో ఉంది. కానీ వ్యవసాయం చేసే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడన్నారు. దానికి ప్రధాన కారణం పాలకవర్గ విధానాలే కారణమన్నారు. రైతులకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని, రైతులు పండించిన ప్రతి పంటను ప్రకటించిన మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్ డి రహమతుల్లా, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూలి వెంగయ్య



పెనుబల్లిలో 'కుటుంబ వైద్య దత్తత'

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ఎసి సుబ్బారెడ్డి మెడికల్ కాలేజ్ -2024 బ్యాచ్ విద్యార్థులు 177 సిబ్బంది ఒక్కొక్కరు ఐదు కుటుంబాలను చొప్పున పెనుబల్లి గ్రామంలోని కుటుంబాలను కుటుంబ వైద్య నిమిత్తం దత్తత కార్యక్రమం చేపట్టారు. స్థానిక మండలంలోని జొన్నవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి మెడికల్ కాలేజ్ విద్యార్థులు శుక్రవారం పెనుబల్లి గ్రామ ప్రజలకు కుటుంబ వైద్య దత్తతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామస్తులను దత్తత తీసుకున్న నాటి నుంచి వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి, వారి పూర్తి వివరాలను సేకరించి వారికి వైద్యం అందించేందుకు ఈ దత్తత కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పెనుబల్లి గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య, ఎంపిటిసి వినయ్ నారాయణ, జొన్నవాడ వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


ప్రజల దాహార్తిని తీర్చాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా బయటకు వస్తే ప్రజలు దాహాన్ని తీర్చుకునేందుకు ఎదురు చూస్తున్నారు వారి దాహాన్ని తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు రావాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం బెజవాడ గోపాల్ రెడ్డి పార్కు సెంటర్ నందు శుక్రవారం ఆమె చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం పట్టణానికి స్థానిక మండలాన్నించే కాకుండా ఇతర మండలాల ప్రజలు కూడా నిత్య అవసరాల సరుకుల కోసం, వారి అవసరాల నిమిత్తం ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో వస్తుంటారని, వారందని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. నగర పంచాయతీ తరపున త్వరలోనే మరో నాలుగు చలివేంద్రాలను ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాళ్ల వైష్ణవి, కత్తి శ్రీదేవి, కత్తి నాగరాజు, వవ్వేరు గ్రామ టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఎఇలు వెంకటేష్, పూజిత, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



రాజకీయ ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-కోవూరు

కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తహశీల్దార్ నిర్మలానందబాబా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతినెలా ఈ సమావేశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్ లిస్టుకు సంబంధించి మార్పులు, చేర్పులు తొలగింపులు ఏమైనా ఉంటే ఆ విషయాలను లిఖితపూర్వకంగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారికి అవగాహన కల్పించి వారి ఓట్లు చేర్చుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిడిపి, వైసిపి, బిఎస్‌పి పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతులు 471పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 323బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 140పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్‌బి 119ఆర్‌ఆర్ 04సి ఆర్ 17కాగా అధిక బరువుతో ఉన్న 08బేళ్ళను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.262.42 నమోదు కాగా వేలంలో 10మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

పలుచోట్ల పోషణ పక్షోత్సవ కార్యక్రమాలు



ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కొరుటూరు, జగదేవిపేట అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం సిడిపిఒ రాజ్యలక్ష్మి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిశువుల్లో ఇన్ఫెక్షన్లను నివారించ డానికి చేతులు కడుక్కోవడం, పరిశుభ్రత నిర్వహించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టి అంటువ్యాధులు ప్రబల కుండా చేయవచ్చని, భోజనానికి ముందు తర్వాత కచ్చితంగా చేతులు శుభ్రపరచు కోవాలని తద్వారా శిశువుల్లో వివిధ రకాల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చన్నారు. అనంతరం అలాగే హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించి డెమోతో వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సుబరత్నం, మంజుల, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని మినగలు, పాత దేవరాయపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మవతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలో పోషక ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించడమే పోషన్ పక్వాడ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భిణులు తక్కువ ఖర్చులో మనకు అందుబాటులో ఉన్న పోషక ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు శారద, నాగమణి, అంగన్‌వాడీ వర్కర్ మినగల్లు, పాత దేవరాయపల్లి గ్రామాల అంగన్‌వాడీలు, తదితరులుపాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా బుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు సెక్టార్ పరిధిలోని గుమ్మళ్లదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గుమ్మళ్లదిబ్బ పుర వీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశాలు ఉన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని జమ్మవరం గ్రామపంచాయతీలోని జమ్మ వరం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు సిడిపిఒ సునీలత ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళా పోలీస్ షేక్.అమ్ములు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణ్ ఆధ్వర్యంలో చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ స్కూల్ పిల్లలు, అంగన్‌వాడీలు అరుణ, పి.సులోచన, ఆయా, దొరసానమ్మ, జి.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వంచన' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కావలి



2019 - 24లో జరిగిన పాలన వివరిస్తూ స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ అధినేత మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సామాజిక వేత్త, పాత్రికేయులు డాక్టర్ డి.ఉదయ కుమార్ రచించిన వంచన (2019-24) పుస్తకాన్ని కావలి టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసీపీ గత ఐదేళ్ల పాలనలో అరాచకాలు, దోపిడీలకు అడ్డూ అదుపులేకుండా పోయిందన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు జరిగాయని, విధ్వంసాలు సృష్టించారని తెలిపారు. వీటన్నింటిని రచయిత ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి దిశగా రాష్ట్రం దూసుకు పోతుందన్నారు. పుస్తక రచయిత మాట్లాడుతూ మొదటి కాపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశామని, రెండవ కాపీని కావలిలో ఆవిష్కరించామని, ఈ పుస్తకాల ముద్రణకు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. టిడిపి నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరివీధి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Principal Junior Civil Judge : Nellore

O.S.No. 955 / 2023

Mudhireddy @ Maddireddy Venkatadri Reddy - Plaintiff

Vs

Dandu Ram Prasad - Defendant

Notice to Defendant

Dandu Ram Prasad,
S/o **Penchala Reddy,** Residing at Jagadevipeta, Indukurpeta Mandal, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారికోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే01-05-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పమిడి ఝాన్సీ, బి.కాం., ఎం.ఎల్.,
వాది తరపు న్యాయవాది, నెల్లూరు.